


## అంబేద్కర్‌కు ఘన నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. శాసనసభ ప్రాంగణంలోని ఆ మహనీయుని విగ్రహానికి ప్రస్తుత శాసన సభాపతి, శాసన మండలి చైర్మన్ తో కలిసి శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. – వరంగల్ వాయిస్, హైదరాబాద్


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 75
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
డిసెంబర్ 06, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# స్టాప్.. స్టాప్..

- రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్స్
- పొంచి ఉన్న ప్రమాదం
- ఏళ్లతరబడి పట్టించుకోని బల్దియా
- ప్రాణాలు పోతేగాని స్పందించరా అంటున్న జనం
- గ్రేటర్ పనితీరును ఎండగడుతున్న ప్రజలు

ప్రజలకు ఉపయోగపడే ప్రణాళికలు రూపొందించడంలో వరంగల్ మహా నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ప్రతి యేడు కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పకొంటున్నా ప్రజల కనీస అవసరాలను గుర్తించడంలో గ్రేటర్ పాలకవర్గం వెనుకబడుతోంది. అయితే ప్రజోపయోగ పనులను పక్కనబెట్టి పర్సంటేజీలు వచ్చే పనులకే వారు పెద్ద పీట వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మహా నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో గత కొన్ని సంవత్సరాలుగా నోళ్లు తెరిచిన మ్యాన్ హోల్స్ డేంజర్ బెల్స్ మోగిస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం వారి నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్ హోల్స్ తో ప్రమాదాలు పొంచి ఉన్నా అధికారులు మాత్రం నిద్ర మత్తును వీడడంలేదు. దీంతో ప్రాణాలు పోతేగాని స్పందించరా అంటూ నగర ప్రజలు గ్రేటర్ పనితీరును బాహాటంగా ఎండగడుతున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ పోలీసులే కొంత మేరకు స్పందిస్తున్నారు. మ్యాన్ హోల్స్ ఉన్న ప్రాంతాల్లో స్టాప్.. అన్న సూచికలను పెట్టి ట్రాఫిక్ ను డైవర్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో బల్దియా పాలకులు, అధికారులకన్నా ట్రాఫిక్ పోలీసులే నయం అంటూ ప్రజలు మెచ్చుకుంటున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

వివరాలు2లో..




# సింపోజియంలో డాక్టర్ కడియం కావ్య

హైద్రాబాద్ షెరాటన్ హోటల్లో శుక్రవారం ప్రతిష్టాత్మక మలయాళ మనోరమ గ్రూపులోని దవీక్ వారు నిర్వహించిన జాతీయ ఉత్తమ హాస్పిటల్ అవార్డు, సింపోజియం కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సబ్ కమిటీ మెంబర్, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. దేశంలోని ప్రముఖ వైద్య సంస్థలకు చెందిన నిష్ణాతులైన వైద్యనిపుణులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రి దామోదర రాజ నర్సింహ హాజరయ్యారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

# నగర సమగ్రాభివృద్ధికి కృషి



8లో..

- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- రూ.1.23 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కమ్యూనిటీ హాల్ స్థల దాతకు సన్మానం









# స్టాప్.. స్టాప్..

- రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్స్
- పొంచి ఉన్న ప్రమాదం
- ఏళ్లతరబడి పట్టించుకోని బల్దియా
- ప్రాణాలు పోతేగాని స్పందించరా అంటున్న జనం
- గ్రేటర్ పనితీరును ఎండగడుతున్న ప్రజలు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** నగరంలో పైప్ లైన్ల లీకేజీల జాతర కొనసాగుతోంది. వీటికి తోడు నోళ్లు తెరచిన మ్యాన్ హోల్స్ జన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో ఇవి అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తున్నా పాలకులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన గ్రేటర్ పాలకవర్గం, అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

## పర్సంటేజీల జాతర..

వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో ప్రతి యేడు కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రతి పనిలో ఇంజినీరింగ్ అధికారులు, పాలకవర్గం, కార్పొరేటర్లు ఇలా ప్రతి ఒక్కరు వారి పర్సంటేజీని ముందే ఫిక్స్ చేసి కాంట్రాక్టర్ నుంచి తీసుకుంటున్నారు. బిల్లులు చేసే సమయంలో అకౌంట్స్ విభాగానికి ముడుపులు చెల్లించాల్సిందే. ఇలా ప్రతి పనిలో పర్సంటేజీల జాతర కొనసాగుతోంది. అయితే అధికారులు, పాలకవర్గం ప్రజోపయోగ పనులను పక్కన బెట్టి వారి జేబులు నిండే పనులకే జై కొడుతున్నట్లు ఆరోపణలున్నాయి. పెద్ద మొత్తంలో పర్సంటేజీలు వచ్చే పనులకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ తక్కువ వచ్చే వాటిని పక్కన బెడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే అక్కువ మొత్తంలో ఆదాయం ఉండే మ్యాన్ హోల్స్ మరమ్మతులను అధికారులు, పాలకవర్గం గాలికొదిలింది.

## కొన్ని ఉదాహరణలు..

★ కాశిబుగ్గ జంక్షన్ లో గత కొన్ని సంవత్సరాలుగా మూత లేని మ్యాన్ హోల్ అత్యంత ప్రమాదకంగా ఉంది. నిత్యం వేలదామంది ఈ రహదారి గుండా ప్రయాణిస్తున్నా మ్యాన్ హోల్ పై మూత పెట్టేందుకు బల్దియా అధికారులకు చేతులు రావడం లేదు. అయితే స్మార్ట్ సిటీలో భాగంగా రహదారితో పాటు జంక్షన్ అభివృద్ధి చేయాల్సి ఉన్నా గత సంవత్సరకాలంగా పనుల్లో అడుగు ముందుకు పడడంలేదు.

★ ములుగు రోడ్డు జంక్షన్ సమీపంలోనే ప్రధాన రహదారి మధ్యలో పైప్ లైన్ లీకేజీ నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి ప్రమాద హెచ్చరిక సూచికను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడడంలేదు.

★ వరంగల్ అండర్ బ్రిడ్జి నుంచి హెడ్ పోస్టాఫీస్ రహదారిలో కుంగిన మ్యాన్ హోల్స్ ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. వివిధ ప్రాంతాలనుంచి నగరానికి వచ్చే వారు నిత్యం ఈ రహదారిలోనే ప్రయాణిస్తున్నారు. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన రహదారిలో ప్రమాదకరంగా ఉన్నా కుంగిన మ్యాన్ హోల్స్ బల్దియా అధికారులకు కనిపించకపోవడం శోచనీయం.

★ ఎల్లంబజార్ లో నోరు తెరిచిన మ్యాన్ హోల్ కు మూత పెట్టడంలో బల్దియా అధికారులు విఫలం అయ్యారు. దీంతో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా స్థానికులే స్పందించి మ్యాన్ హోల్ లో పెద్ద నల్లా పైప్ ను వేసి కొద్ది పాటి రక్షణ చర్యలను చేపట్టారు.

★ వరంగల్ లోని ఆర్వోబీ సమీపంలో ఇంతెజార్ గంజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో రక్షణ లేని మ్యాన్ హోల్ ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారింది. అదే విధంగా అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని పెరుకవాడ వాటర్ ట్యాంక్ సమీపంలోని మ్యాన్ హోల్ అటుగా ప్రయాణించే వారిలో దడ పుట్టిస్తున్నాయి. బల్దియా ప్రధాన కార్యాలయం సమీపంలోని రామన్నపేట బైపాస్ రోడ్డులోని మూల మలుపులో ఉన్న పైప్ లైన్ లీకేజీ ప్రమాదకరంగా మారింది.

## అధికారులు స్పందించాలి..

నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా పొంచి ఉన్న మ్యాన్ హోల్స్ పై బల్దియా అధికారులు, పాలకవర్గం స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా స్పందించేవారు కరువయ్యారు. అయితే ప్రాణాలు పోతేగాని స్పందించరా అంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన మ్యాన్ హోల్స్ పై స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రేటర్ అధికారులు దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# పోలీసులకు చిక్కిన బ్యాంక్ దొంగలు




- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్ వాయిస్, క్రైం :** గత నెల 18వ తేది రాత్రి రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్బీఐలో దోపిడికీ పాల్పడిన ఉత్తరప్రదేశ్, మహరాష్ట్రకు చెందిన ఏడుగురు సభ్యుల ముఠాలోని ముగ్గురు దొంగలను వరంగల్ పోలీసులు అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడితో సహా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. నింధితులనుంచి సుమారు రూ.1.80 కోట్ల విలువైన 2.520 కిలోల బంగారం అభరణాలు, ఒక కారు, రూ.10వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు



అరెస్టు చేసిన వారిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్షాద్ అన్సారీ, షాఖీర్‌ఖాన్ ఆలియాస్ బోలెఖాన్, హిమాన్షు బిగాం చండ్ జాన్వర్ ఉన్నట్లు తెలిపారు. కాగా పరారీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ నవాబ్ హసన్, సాజిద్ ఖాన్, మహరాష్ట్రకు చెందిన అక్షయ్ గజానన్ అంబోర్, సాగర్ భాస్కర్ గోర్ ఉన్నట్లు వెల్లడించారు. అయితే ఈ భారీ చోరీని అతి స్వల్పకాలంలో చేధించడంతో పాటు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీలు నర్సయ్య, భోజరాజు, కిరణ్‌కుమార్, ఆత్మకూర్, రఘునాథ్‌పల్లి, సీసీఎస్, వర్ధన్నపేట, పాలకుర్తి, నర్మెట్ట, టాస్క్‌ఫోర్స్, పోలీస్ కంట్రోల్ రూంకు చెందిన ఇన్స్‌స్పెక్టర్లు సంతోష్, శ్రీనివాసరెడ్డి, బాలాజీ వరప్రసాద్, శివకుమార్, రఘుపతి రెడ్డి, శ్రీనివాస్‌రావు, మహెందర్ రెడ్డి, అబ్బయ్య, పవన్‌కుమార్, విశ్వేశ్వర్, ఏఎఓ సల్మాన్‌పాషాతో పాటు ఎస్సైలు, ఇతర దర్యాప్తు పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# అంబేద్కర్ రాజ్యాంగంతోనే అన్ని వర్గాలకు ఫలాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలోని అన్ని వర్గాల ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు, హక్కులను అందించి రక్షణ కల్పించిన మహానుభావుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరిలు కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని తెలిపారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరే విధంగా హక్కులను కల్పించి ప్రతీ ఒక్కరికి రక్షణ కల్పించారన్నారు. ఎంతో ముందు చూపుతో రాజ్యాంగంలో అన్ని అంశాలను పొందుపర్చిన గొప్ప జ్ఞాని అంబేద్కర్ అని కొనియాడారు. నేడు ప్రతీ ఒక్కరం తల ఎత్తుకొని జీవించగలుగుతున్నామంటే అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే అని, అలాంటి రాజ్యాంగంపై ఇప్పుడు దాడి జరుగుతున్నదన్నారు. కులాల పేరిట, మతాల పేరిట విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని, దానిని మనందరం ఐక్యమత్యంతో సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ అంబేద్కర్ బాటలో పయనిస్తూ అయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ అందరికీ సమాన విద్య,ఆరోగ్యం, ఉపాధి, రక్షణ, నివాసం,భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచిన భారత పిత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రదాత, న్యాయ కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, సామాజిక న్యాయం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో దోపిడీకి, అన్యాయాలకు బలైపోతున్న అట్టడుగువర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, శాసన మండలి సభ్యులు బస్వారాజు సారయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, డా.పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే గొప్ప మేధావి అంబేద్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని న్యూ లయోలా హైస్కూల్ లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి స్కూల్ కరస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతి కుమార్, ప్రిన్సిపల్ కర్రె చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ అంబేద్కర్ కృషి వల్ల ఈనాడు బడుగు, బలహీన వర్గాల ప్రజలు చదువు, ఉద్యోగ రాజకీయాల్లో రాణిస్తున్నారని అన్నారు. సామాజిక న్యాయం వైపు ప్రయాణానికి ఆయన రాసిన రాజ్యాంగమే దిక్సూచిగా మారిందన్నారు. ప్రపంచంలోనే గొప్ప మేధావిగా గుర్తింపు లభించినటువంటి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అలాంటి మహనీయుడి అడుగుజాడల్లో అందరూ నడవాలని వారి ఆశయాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


## తొర్రూరులో..



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి ప్రపంచ మేధావి బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తొర్రూరులోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తొర్రూరు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిల్ ధరావత్ జై సింగ్, కర్నె నాగరాజు, పేర్ల జంపా, గుగులోత్ శంకర్ నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, ఆరో వార్డు అధ్యక్షుడు రాయిశెట్టి వెంకన్న, ఉపాధ్యక్షుడు రాయిశెట్టి ఉపేందర్, మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శులు అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు రాయిశెట్టి యాకేందర్, పట్టణ అధ్యక్షులు మంగళపల్లి సుధాకర్, పళ్ల నాగరాజు, డబ్బా శ్రీకాంత్, చిలుక మల్లేష్, మంగళపల్లి వెంకటేష్, మంగళపల్లి ప్రసాద్, గార యాకయ్య తదితరులు పాల్గొని అంబేద్కర్ కు పూలమాలంకరణ చేసి ఘన నివాళులర్పించారు.

# పోరాట యోధుడు బీఆర్ అంబేద్కర్

### ➲దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** పేదల పక్షాన పోరాడిన యోధుడు భారతరత్న డా. బీఆర్ అంబేద్కర్ అని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ డా.అంబేద్కర్ భారతరత్న, న్యాయ కోవిదుడు, రాజ్యాంగ నిర్మాతగా అనేక సేవలందించారని కొనియాడారు. అంబేద్కర్ ఆశయ సాధనలో సాగుదామని పిలుపునిచ్చారు. పేదలకు హక్కులను కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అణగారిన వర్గాల ఆశా జ్యోతి, బడుగు బలహీన వర్గాల ప్రతినిధి స్వరాష్ట్ర ఏర్పాటుకు అంబేద్కర్ ముందు చూపే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీ నారాయణ, వేణు, డివిజన్ అధ్యక్షులు పున్నం చందర్, సదాంత్, ఖలీల్, మనోజ్, నాయకులు సుంచు కృష్ణ, నయీముద్దీన్, సల్వాజీ రవీందర్ రావు, పరుశురాములు, రాజు, శ్రీధర్ రావు, ఎస్కే మహమూద్, రామ్మూర్తి, రాజశేఖర్, యాదగిరి, విజయ్ రెడ్డి, మనోహర్, రాజేష్, దానం, కొండ్ర శంకర్, దేవమ్మ, పావణి, తస్లీమా, సానియా, లత, ప్రశాంత్, రఘు, రాకేష్ యాదవ్, మహేష్, జగన్, ఉపేందర్, రమేష్, అనిల్, విజయ్, రాజశేఖర్, భిక్షపతి, వీరస్వామి, శ్రీకాంత్ చారి, స్నేహిత్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ జడ్పీ చైర్పర్సన్ లకావత్ ధన్వంతి పాల్గొని అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 6న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగిందని, అంబేద్కర్ అందరికీ సమాన విద్య, ఆరోగ్యం, ఉపాధి, రక్షణ, నివాసం, భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచిన భారత పిత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. సమ సమాజ నిర్మాణంలో బాబాసాహెబ్ ను ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్య సమితి "సింబల్ ఆఫ్ నాలెడ్జ్"గా గుర్తించారని తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ప్రజా ప్రభుత్వం పరిపాలన దక్షతను చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీడబ్ల్యూఎంసీ సిబ్బందికి సత్కారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 36వ డివిజన్ లోని చింతల్ ఎస్సీ కాలనీ వద్ద విగ్రహం వద్ద బీజేపీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ అంబేద్కర్ ఘన నివాళి అర్పించారు. అనంతరం 36వ డివిజన్ ఇంత పరిశుభ్రంగా ఉంచుతున్న జీడబ్ల్యూఎంసీ సిబ్బందికి చిరు సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ 36వ డివిజన్ నాయకులు దుప్పా శ్రీధర్, ఆకారపు శేఖర్, జోగు రాజేంద్ర ప్రసాద్, మధు కుమార్, సిద్ధ రాజు, బంకా రాజ్ కుమార్, మానుపటి నవీన్, ఎల్లయ్య, ముదిగొండ పాపయ్య, ఆనంద విజయ, బోయిని భాను ప్రసాద్, కుమ్మరి రజినీకాంత్, సురాశి రమేష్, తొగరు రమేష్, హనుమండ్ల రఘుపతి, రాయపురం సాంబయ్య, విష్ణువర్ధన్, నల్లగొండ రాజు, పంజబోయిన దేవేందర్, వనం కుమార స్వామి, అంబేద్కరిస్ట్ వాదులు, జీడబ్ల్యూఎంసీ జవాన్లు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## 41వ డివిజన్ లో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత, దేశ తొలి న్యాయ శాఖ మంత్రి భారతరత్న డా బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా 41వ డివిజన్ బీఆర్ ఎస్ ముఖ్యనాయకులు ఆ మహనీయుడికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టి.రమేష్, ఎండీ అలీ, ఎం.సతీష్, పి.భాస్కర్, జి.చేరాలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తాం

## ● ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలోని అంబేద్కర్ నగర్ లో గల భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే అన్నారు. సామాజిక అసమానతలు రూపుమాపేందుకు తన జీవితాంతం పోరాడారని తెలిపారు. దేశానికి విస్తృత రాజ్యాంగం అందించడానికి చేసిన కృషి మరువలేనిదని, అంబేద్కర్ స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, అంబేద్కర్ పోరాటం లక్షల మందిలో స్ఫూర్తి నింపిందన్నారు. మహనీయుని ఆశయాలు కొనసాగిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఈ కార్యక్రమంలో తొర్రూరు మునిసిపల్ చైర్మన్ మంగలపెల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, పార్టీ నాయకులు సోమ రాజశేఖర్, పెదగాని సోమయ్య, సోమన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అచ్చిరెడ్డి, వెంకటాచారి, రాయిశెట్టి ఉపేందర్, పార్టీ శ్రేణులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, వివిధ కుల సంఘ నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## దార్శనికుడు డాక్టర్ అంబేద్కర్

### కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** దార్శనికుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విశ్వవిద్యాలయ దూర విద్య ప్రాంగణంలో ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, ఆయన ఆశయాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దూర విద్య కేంద్ర సంచాలకులు ఆచార్య వి.రామచంద్రం, జాతీయ సేవపథకం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, చరిత్ర విభాగ అధిపతి డాక్టర్ సీహెచ్.రాజకుమార్, విశ్రాంత ఆచార్యులు, ఆచార్య సీహెచ్ సమ్మయ్య, సంగాల గిడియన్, డాక్టర్ కొట్టే భాస్కర్, పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైతు సంఘం ఆధ్వర్యంలో..



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని అమ్మాపురం గ్రామంలో రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందరికీ సమాన విద్య, ఆరోగ్యం, ఉపాధి, రక్షణ, నివాసం, భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచారననారు. ఆయన స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై రైతులను చైతన్య పర్చే దిశగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుంటుక సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలకు తూట్లు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రపంచ మేధావి, భారతరత్న, భారత రాజ్యాంగ కర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయ వ్యవస్థకు నేటి పాలకులు తూట్లు పొడుస్తున్నారని సీపీఐఎంఎల్ మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్నఅన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా నేడు మహబూబాబాద్ లో అంబేద్కర్ చిత్రపటానికి పూలు జల్లి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, అది ఇచ్చిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదాలను నేటి పాలకులు రద్దు చేయడానికి ఒకవైపు కుట్రలు చేస్తూనే మరోవైపు అంబేద్కర్ కు నిజమైన వారసులమని అంత అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, కేసముద్రం సంయుక్త మండలాల కార్యదర్శి పైడ్ల యాకయ్యతో పాటు కొమ్మన బోయిన సోమల్లు, రాజు, మహేష్, రమేష్, బాలు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఒగ్లాపూర్ గ్రామ పంచాయతీలో..



**వరంగల్ వాయిస్, దామెర :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దామెర మండలం లోని ఒగ్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు దుబాసి రాధాకృష్ణ, రాసమల్ల కిరణ్, గ్రామ పంచాయతీ సిబ్బంది రమేష్, శ్రీనివాస్, సబిత, అంగన్వాడీ టీచర్ లక్ష్మిబాయి పాల్గొన్నారు

## గణపురం మండల కేంద్రంలో..



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో మండల అంబేద్కర్ సంఘం నాయకులు శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సభను నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎస్ రాజేందర్, టి.సంపత్, కే.బాబు, ఏ.ఎల్లస్వామి, కే రవి, ఎం.మహేష్, సీహెచ్ శంకర్, మధుకర్, ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వరంగల్ ప్రాంగణంలో పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్యా బాబురావు అధ్యక్షతన శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం సిబ్బందితో పాటు పరిశోధకులు, ఎంఏ తెలుగు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం




**వరంగల్ వాయిస్, పరకాల :** భారత రత్న బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి పరకాల పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ నల్లెళ్ల లింగమూర్తి, కౌన్సిలర్లు దామెర మొగిలి, అడప రాము, శనిగరపు రజినీ నవీన్, బీఆర్ఎస్ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి దుప్పటి సుజయ్ రణదేవ్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గోవింద సురేష్, వార్డు అధ్యక్షులు ఏకు రఘుపతి, బొట్ల నరేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నక్క చిరంజీవి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు శనిగరం శ్రీనివాస్, యూత్ నాయకులు ఇంగిలి వీరేష్ రావు, ఏకు నవీన్, కావటి శ్రీధర్ పాల్గొన్నారు.

## పరకాలలో..



**వరంగల్ వాయిస్, పరకాల :** అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండల ప్రజా పరిషత్ పరకాల కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఇమ్మడి భాస్కర్, కార్యాలయ పర్యవేక్షకులు సీహెచ్ శైలశ్రీ , పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది వివిధ గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

## దామెరలో..



**వరంగల్ వాయిస్, దామెర :** కుల వివక్షతకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాటం చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో సమాజంలో ఉన్న అసమానత లను రూపుమాపేందుకు కోసం నేటి యువత కృషి చేయాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి పిలుపునిచ్చారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దామెర మండలం కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి డీవైఎఫ్ఐ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓ. చిరంజీవి, మండల నాయకులు తేజ్ పాల్, నక్క దీక్షిత్, ఎస్.సాయి కృష్ణ, డి.వరుణ్, శివకుమార్, రాజు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## ● ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** పట్టణంలో రాష్ట్ర ప్రజా ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి చేయూతనిస్తూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పర్చిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ మహిళలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, బలోపేతం చేయడానికి, ఈ మహిళా శక్తి క్యాంటీన్లు దోహదపడతాయని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. అమ్మ చేతి వంట నాణ్యతను అందించాలని నిర్వాహకులను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం 150 ఇంద్ర మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందని, గతంలో డ్వాక్రా మహిళా సంఘాల అక్కాచెల్లెమ్మలకు సున్నా వడ్డీ రుణాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, నూతనంగా ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం మహిళ అభ్యున్నతికి తొలి ప్రాధాన్యతనిస్తూ మహాలక్ష్మి, గృహలక్ష్మి లాంటి పథకాలతో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళా సంఘాల మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, నియోజకవర్గ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### తొర్రూరును మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా..

పట్టణంలోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కొనుగోలు చేసిన ఇరవై మూడు లక్షల యాభై వేల నిధులతో రెండు ట్రాక్టర్లు, పద్నాలుగు లక్షల నలభై నాలుగు వేలతో కొనుగోలు చేసిన డోజర్, నూతన వాహనాలను జెండా ఊపి శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు హనుమాండ్ల యశస్విని ఝాన్సీ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశశ్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పట్టణ ప్రాంతాల అభివృద్ధియే ధ్యేయంగా పని చేస్తున్నారని, తొర్రూరు మున్సిపాలిటీనీ తెలంగాణ రాష్ట్రంలో మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే యశశ్విని ఝాన్సీ రెడ్డి తెలిపారు. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతి ఒక్కరికి అందే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు దొంగరి రేవతి, గజానంద్, తునం రోజా, బిజ్జాలా మాధవి, కోఆప్షన్ సభ్యులు, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, మండల అధ్యక్షులు సుంచు సంతోష్, అధికారులు, నియోజకవర్గ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంకే నాయుడు హోటల్ ఎండీకి సత్కారం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల ప్రారంభించబడిన ఎంకే నాయుడు హోటల్ అండ్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవ సమయంలో ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి గుజరాత్ రాష్ట్ర పర్యటనలో ఉండి వీలుకానందున వారి ఆహ్వానం మేరకు గురువారం చాంబర్ కార్యవర్గ సభ్యులతో కలిసి హోటల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే, శాలువాతో సత్కరించి అభినందించారు. వరంగల్ జిల్లాలో పారిశ్రామిక, పర్యాటక రంగం, విమానాశ్రయం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పారిశ్రామిక దిగ్గజాలు, సీఈఓలు బస చేయడానికి వీలుగా నగరంలో అన్ని వసతులతో స్టార్ హోటల్ అండ్ కన్వెన్షన్ సెంటర్ ను నిర్మించి పారిశ్రామిక, పర్యాటక అవసరాలు తీర్చుటకు వారు చేసిన కృషి ఎంతో ఆనందదాయకమని, వారి హోటల్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని హోటల్ ఏర్పాటు చేసినందుకు వారిని అభినందిస్తూ హోటల్ అభివృద్ధి చెందడంలో చాంబర్ ఆఫ్ కామర్స్ వారు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్, అడ్తి సెక్షన్ అధ్యక్షులు ఎన్ రెడ్డి లింగారెడ్డి, ఛాంబర్ కార్యవర్గ సభ్యులు కైలాస హరినాథ్, సూదాటి రాజేశ్వర్ రావు, గౌరిశెట్టి శ్రీనివాస్, కో ఆప్షన్ మెంబర్ రాయిశెట్టి సత్యనారాయణ, సలహాదారుడు పుప్పాల యుగేందర్, వెల్ది చక్రధర్ హాజరయ్యారు.

# అమరవీరుల ఆశయాలను సాధించాలి

## ➲ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అమరవీరుల ఆశయాలను సాధించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఇటీవల అమరులైన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ జరిగింది. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ ఉమ్మడి వరంగల్ జిల్లా సంస్మరణ సభలో తక్కళ్లపల్లి శ్రీనివాస రావు పాల్గొని మాట్లాడుతూ ఎర్ర జెండా నీడన చివరి వరకూ ప్రజల కోసం పోరాడిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీకేఎంయూ కామ్రేడ్ బాల మల్లేష్, ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శి పోటు ప్రసాద్ ల మృతి పార్టీ, ప్రజా సంఘాలకు తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా బాల మల్లేష్ చిత్రపటానికి సీపీఐ, బీకేఎంయూ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి హనుమకొండ జిల్లా సీపీఐ కార్యదర్శి భిక్షపతి హాజరై మాట్లాడుతూ బాల మల్లేష్ మృతి సీపీఐకి తీరని లోటన్నారు. బాల మల్లేష్, పోటు ప్రసాద్ ఇద్దరూ అకస్మిక గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మహబూబాబాద్, జనగామ, వరంగల్, ములుగు జిల్లాల కార్యదర్శులు బి.విజయ సారథి, సీహెచ్ రాజారెడ్డి, మేకల రవి, తోట మల్లిఖార్జున రావు, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, బి.అజయ్, ఆదరి శ్రీనివాస్, నల్లు సుధాకర్ రెడ్డి, ఎస్కే బాషుమియా, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, పనాస ప్రసాద్, ఆకుల శ్రీనివాస్, భూపాలపల్లి జిల్లా నాయకులు కొరిమి సుగుణ, మామిడాల సమ్మిరెడ్డి, సొతుకు ప్రవీణ్, ఆయా జిల్లాల నాయకులు బుస్సా రవీందర్, కర్రే లక్ష్మణ్, బాషబోయిన సంతోష్, బత్తిని సదానందం పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 60వ డివిజన్ వడ్డెపల్లిలో శుక్రవారం దాదాపు రూ.6.43 కోట్లతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.కోటి నలభై మూడు లక్షలతో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం, ఐదు కోట్లతో నిధులతో డివిజన్ అంతర్గత రోడ్ల నిర్మాణం,సైడ్ డ్రైన్ ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఒకే రోజు దాదాపు ఆరు కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని చేపడుతామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యాకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రంగోలమ్మ పాట ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డబుల్ స్టార్ ఫోక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన రంగోలమ్మ అనే పాటను మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆవిష్కరించారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్, డైరెక్టర్ నీరటి పావని, మరో ప్రొడ్యూసర్ లత, మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్, గేయ రచయిత రాజు, మిగితా బృంద సభ్యులను ఆయన ప్రత్యేక అభినందించారు. రంగోలమ్మ పాట శ్రోతలను అలరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంచు కృష్ణ, మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి, నాయకులు నయీమొద్దీన్, పాలడుగుల శివకుమార్, దానం, శ్రీధర్ రావు, దేవమ్మ, సానియా, తస్లిమా పాల్గొన్నారు.

# ప్రజాపాలన కళాయాత్ర



**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయడంలో భాగంగా శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు మల్హర్ మండలం లో కళాయాత్ర నిర్వహించారు. మండలంలోని కొయ్యూరు, వల్లెంకుంట గ్రామాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల గురించి పాటల రూపంలో ప్రజలకు వివరించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఓనపాకల కుమార్, కమ్మల ప్రవీణ్ కుమార్, ఆత్మకూరి మహేందర్, చీకట్ల శంకర్, చిలుముల మధుబాబు, సెగ్గం శిరీష, జాడీ సుమలత, సోదారి సురేందర్, పులి రాధిక, కాస స్వాతి, గడ్డం నాగమణి పాల్గొన్నారు.

## టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశంను కలిసిన శామంతుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ గా ఇటీవల నియమితమైన బుర్ర వెంకటేశంను మర్యాద పూర్వకంగా హైదరాబాద్ కార్యాలయంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ శుక్రవారం కలిసి పూల మాలలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా బిడ్డగా ఉన్నత స్థానంలో ఉండటం చాలా గర్వకారణమని ప్రత్యేకంగా అభినందించారు.

## ఆచార్య రాజేందర్ కట్లకు సన్మానం



**వరంగల్ వాయిస్, కే యూ :** కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల విభాగ నూతన పరిక్షల నియంత్రణ అధికారి గా నియమితమైన ఆచార్య రాజేందర్ కట్లను కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.అమరావేణి, ఆచార్య ఎస్. నరసింహ చారి, డాక్టర్ ఫణింద్ర కటకంతో పాటు ఎంకాం, ఎంబీఏ, పరిశోధక విద్యార్థులు శాలువా, పుష్పగుచ్చాలతో అభినందించారు.

## సీఎం కప్ క్రీడలకు సిద్ధం కావాలి



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలో ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనేందుకు సిద్ధం కావాలని ఎంపీడీవో లక్కపెల్లి భాస్కర్ పేర్కొన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలని కోరారు. ఈనెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో 10, 11, 12 తేదీల్లో మండల స్థాయిలో క్రీడల నిర్వహణ ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లను గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

## ఘనంగా మార్గశిర మాస మహోత్సవం



**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురంలో కాకతీయుల రెడ్డి గుడి( శివ నాగ లింగేశ్వరఆలయం) మొదటి శుక్రవారం ఘనంగా జరిగింది. అర్చకులు కొలనుపాక భద్రయ్య భక్తులతో ఘనంగా పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివుడికి అభిషేకం చేశారు. శివుడికి ప్రీతి పత్రమైన నైవేద్యాలు అర్పించి పూజలు చేసినట్లు అర్చకులు వివరించారు.

## డోర్నకల్ లోనే సమీకృత గురుకులాన్ని నిర్మించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ నియోజకవర్గానికి మంజూరైన సమీకృత గురుకులాన్ని డోర్నకల్ మండలంలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తు అంబేద్కర్ సేవ సంఘం, పట్టణ యువత ఆధ్వర్యంలో వేరు వేరుగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ సెంటర్ లో జరిగిన నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. నిరాధారణకు గురవుతున్న డోర్నకల్ లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ప్రస్తుతం రూ.200 కోట్లతో మంజూరీ లభించిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఇక్కడే నిర్మించాలని డిమాండ్ చేశారు. గాజుల వేణు, విలియమ్, ప్రవీణ్, రాము, రామణ, నాగేందర్, లవన్, లక్కన్, సత్యనారాయణ, సురేష్, అభిషేక్, మల్లేషం, నవాబ్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమిద్దాం

### ➲ డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్



**వరంగల్ వాయిస్, దేవన్నపేట :** ప్రపంచ మేధావి, నవయుగ పురుషుడు భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఉద్యమ స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించి హక్కులను సాధించుకుందామని, మనువాదుల చెర నుండి భారత రాజ్యాంగాన్ని రక్షించుకొవాల్సిన బాధ్యత మనపై ఉందని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవన్నపేట గ్రామంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మహానీయుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చుంచు నరేష్ మాట్లాడుతూ భారత దేశ ప్రజలకు తన ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తున్న, అణగారిన వర్గాలకు భారత రాజ్యాంగం రూపంలో హక్కులను ప్రవేశ పెడితే కొంతమంది మనువాద శక్తులు రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నారని, భారత రాజ్యాంగాన్ని, చట్టాన్ని, హక్కు లను కాపాడుకోని, ప్రశ్నించేతత్వాన్ని పెంపోందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత వాది కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సందెల రవిందర్ (చిన్న), డీబీఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు చుంచు రాజు, కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట ఎస్సీ సెల్ చైర్మన్ నందిపాక బాస్కర్, పోలేపల్లి రవి, కొప్పుల సంపత్, చుంచు సరేష్, డీబీఎఫ్ నాయకులు చుంచు సుందర్, సందెల అనిల్, చుంచు క్రాంతి, ఆరే సంతోష్, సందెల ప్రశాంత్, సందెల సంపత్, సుధాకర్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కమిషనర్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర పన్నుల, వాణిజ్య శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లా జాయింట్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన విశ్వబ్రాహ్మణ జాతీయులు రావుల శశిధర్ ను వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) ముఖ్య సలహాదారు అకోజు సురేందర్ రావు ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వరంగల్ డివిజన్ రాష్ట్ర పన్నుల, వాణిజ్య శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన శశిధర్ కు వోపా నాయకులు దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో వోపా రాష్ట్ర సలహాదారులు, తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చోల్లేటి కృష్ణమాచార్యులు, ఉమ్మడి జిల్లా వోపా అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం భిక్షపతి తదితరులు ఉన్నారు.

## ప్రమాదవశాత్తు హర్వెస్టర్ దగ్ధం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని మల్లారం గ్రామ సమీప పంట పొలాల్లో శుక్రవారం ప్రమాదవశాత్తు హర్వెస్టర్ దగ్ధమైంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన వ్యక్తి కి సంబంధించిన హర్వెస్టర్ మల్లారం గ్రామానికి వరి కోతల కోసం రాగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హర్వెస్టర్ పూర్తిగా దగ్ధమైంది. హర్వెస్టర్ డ్రైవర్ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నట్లు స్థానికులు తెలిపారు.

# వైభవంగా అయ్యప్ప పల్లకి సేవ



**వరంగల్ వాయిస్, హనుమకొండ** : స్థానిక కేయూ డబ్బాల్ లోని శ్రీ దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప పల్లకి సేవ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కేయూ పెగడపల్లి డబ్బాల్ సెంటర్ నుంచి రిలయన్స్ ఫ్రెష్ మీదుగా హనుమాన్ నగర్ వయా కేయూ సెంటర్ వరకు కొనసాగి చివరకు మళ్లీ దాసాంజనేయ స్వామి దేవాలయం వద్ద ముగింది. ఈ ఊరేగింపులో అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున తరలి రావంతో ఆధ్యాత్మిక శోభతో అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామిని నగరంలో ఊరేంగించారు. మహిళలు స్వామి వారి మంగళహారతులతో స్వాగతం పలుకగా మాలధారులల అయ్యప్ప శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో శ్రీ దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ కమిషనర్లను నియమించాలి



**వరంగల్ వాయిస, హైదరాబాద్ :** సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్-3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు ఉందన్నారు. అతి తొందరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆర్టీఐ కమిషనర్లను నియమించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోసం వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, 30రోజుల్లోగా ఇవ్వ వలసిన సమాచారాన్ని కొన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీల్ సమాచారం ఇవ్వట్లేదనీ, అలాగే సెక్షన్ 19(3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీఐ కమిషనర్లను నియమించాలని, సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియా రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వింజమూరి గణేష్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అజిత్ స్పీడ్‌కు బ్రేక్..




కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. మగిజ్ తిరుమేని దర్శకత్వంలో తెరక్కుతున్న సినిమా 'విదాముయార్చి'. 62గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో త్రిష కృష్ణన్ హీరోయిన్. ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో ఆరవ్, అర్జున్, రెజీనా, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్ రిలీజైన విషయం తెలిసిందే. దీనికి మంచి స్పందన కూడా వచ్చింది. ఇక సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకి తీసుకురావడమే బాకీ అనుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ హాలీవుడ్ నిర్మాణ సంస్థ మేకర్స్ కి రఞలక్ ఇచ్చింది. ఇంతకీ ఏమైందంటే.. కోలీవుడ్ టాప్ హీరో అజిత్ కుమార్ లేటెస్ట్ ఫిల్మ్ 'విదాముయార్చి' సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకి వచ్చేందుకు సిద్ధమైంది. అయితే ఈ సినిమా హాలీవుడ్ మూవీ 'బ్రేక్ డౌన్'కి కాపీ అంటూ ఆ సినిమా ప్రొడ్యూసర్స్ లీగల్ పోరుకు సిద్ధమయ్యారు. దీంతో ఈ సినిమా విడుదలపై సందిగ్ధం ఏర్పడిరది. ఒరిజినల్ మేకర్స్ నుండి ఎలాంటి పర్మిషన్స్ తీసుకోకుండా లైకా సంస్థ ఈ సినిమాని తెరకెక్కించడంపై పారామౌంట్ నిర్మాణ సంస్థ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక ఈ సినిమా టీజర్‌ను గమనిస్తే.. హీరో అజిత్ కుమార్ డిఫరెంట్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ప్రపంచమంతా నిన్ను నమ్మకపోయినా పరవాలేదు.. నిన్ను నువ్వు నమ్ముకో.. అనే కాన్సెప్ట్‌తో యాక్షన్ బేస్డ్ మూవీగా ఈ సినిమా తెరకెక్కినట్లుగా ఈ టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. అజిత్ దేని కోసమో అన్వేషిస్తూ.. అడ్డువచ్చిన విలన్స్ భరతం పడుతూ.. తాను సాధించాల్సిన లక్ష్యం కోసం ఏం చేయటానికైనా, ఎంత దూరం వెళ్లటానికైనా, ఎవరినైనా ఎదిరించేలా ఇప్పటి వరకు కనిపించని ఓ వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు.



# ఓటీటీలోకి కంగావా



సూర్య హీరోగా శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కంగువా' ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. డిసెంబరు 8న ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ప్రైమ్ వీడియో ఎక్స్ వేదికగా పోస్టర్‌ను పంచుకుంది. తెలుగుతోపాటు హిందీ, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో ఇది అందుబాటులో ఉండనున్నట్లు తెలుస్తోంది. విశాపటానీ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో బాబీదేవోల్ విలన్‌గా కనిపించారు. ఫ్రాన్సిస్ (సూర్య) గోవాలో ఓ బౌంటీ హంటర్. పోలీసులు కూడా చేయలేని పనుల్ని చేసి, అందుకుగానూ వాళ్ల నుంచి డబ్బు తీసుకుంటూ కాలం గడుపుతుంటాడు. ఏంజెలా (దిశా పటానీ)దీ ఇదే పని. ఒకప్పుడు వీరిద్దరూ ప్రేమికులే. ఆ తర్వాత విడిపోయి ఎవరి దారులు వాళ్లు చూసుకుంటారు. ఫ్రాన్సిస్, తన స్నేహితుడు (యోగిబాబు)తో కలిసి ఓ బౌంటీ హంటింగ్ పనిపై ఉన్నప్పుడే జీటా అనే బాలుడిని కలుసుకుంటారు. ఫ్రాన్సిస్, జీటా కలుసుకోగానే ఇద్దరికీ ఏదో తెలియని సంబంధం ఉన్న భావన కలుగుతుంది. ఆ తర్వాత ఆ బాలుడి ప్రాణానికి ప్రమాదం ఉందని అర్థమవుతుంది. మరి జీటాని కాపాడటానికి ఫ్రాన్సిస్ ఎలాంటి సాహసాలు చేశాడు. ఈ జీటాని వెంటాడుతున్నది ఎవరు? ఫ్రాన్సిస్, జీటా, 1070 సంవత్సరాల నాటి ప్రణవకోన యువరాజు కంగువా (సూర్య) కి మధ్య సంబంధం ఏమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమాపై ఓ లుక్కేయాల్సిందే!



# షారుఖ్‌ఖాన్ రికార్డు బద్దలు

అల్లు అర్జున్ –సుకుమార్ కాంపౌండ్ నుంచి వచ్చిన మోస్ట్ ఎవెయిటెడ్ ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. ఈ పాన్ ఇండియా సినిమా తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై రికార్డుల వేట మొదలుపెట్టింది. పుష్ప 2 ది రూల్ రిలీజైన అన్ని సెంటర్లలో దాదాపు హౌస్‌ఫుల్ షోలతో విజయవంతంగా స్క్రీనింగ్ అవుతోంది. ఇప్పటికే ఓపెనింగ్ డేన నైజాం ఏరియాలో ఈ చిత్రం రూ.30 కోట్లు షేర్ రాబట్టి.. ఆర్‌ఆర్‌ఆర్ (రూ.23.38 కోట్లు) పై ఉన్న రికార్డును అధిగమించినట్టు వార్తలు వచ్చాయి. తాజాగా మరో అరుదైన ఫీట్‌ను ఖాతాలో వేసుకుందని బీటౌన్ సర్కిల్ కథనం. జవాన్ ఫస్ట్ డే రూ.65 కోట్లు వసూళ్లు రాబట్టగా.. పుష్ప 2 రూ.67 కోట్లతో రికార్డ్‌ను బీట్ చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఈ లెక్కన పుష్ప 2 బాక్సాఫీస్ రికార్డుల మోత ఖాయమని పుష్పరాజ్ చెప్పకనే చెబుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

## థియేటర్ నుంచి బయటకు పరుగులు తీసిన ప్రేక్షకులు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ది రూల్ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ టాక్‌తో నడుస్తుంది. ఇక నార్త్ సౌత్ అని తేడ లేకుండా అన్ని థియేటర్లలో హౌజ్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ప్రదర్శితమవుతున్న ముంబై బాంద్రాలోని గెలాక్సీ థియేటర్ లో పెప్పర్ స్ప్రే కలకలం రేపింది. సినిమా సెకండ్ ఆఫ్‌కి ముందు.. గుర్తు తెలియని వ్యక్తి థియేటర్లో పెప్పర్ స్ప్రే చేశాడు. దీంతో అక్కడ ఉన్న ప్రేక్షకులు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతూ.. కొంతమంది దగ్గుతూ థియేటర్ బయటికి పరుగులు తీశారు. దీంతో థియేటర్ యాజమాన్యం పెప్పర్ స్ప్రే ఘాటును తొలగించే ప్రయత్నం చేయడంతో పాటు 30 నిమిషాల వరకు సినిమా ప్రదర్శనను నిలిపివేసింది. అనంతరం మళ్లీ ప్రదర్శించింది. ఈ ఘటనపై థియేటర్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానం ఉన్నవారిని అదుపులోకి తీసుకుని



# రూమర్స్‌కు చెక్

### ఒకే ఫ్రేమ్‌లో ఐశ్వర్య.. అభిషేక్

బాలీవుడ్ స్టార్ జంట ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ విడాకులు తీసుకోబోతున్నారంటూ గత కొంత కాలంగా వార్తలు హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ వార్తలపై ఇద్దరూ ఎప్పుడూ బహిరంగంగా స్పందించలేదు. తాజాగా ఈ రూమర్స్‌కు చెక్ పెడుతూ ఐశ్వర్య అభిషేక్ జంట ఒకే ఫ్రేమ్‌లో దర్శనమిచ్చారు. వీరిద్దరూ కలిసి తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరయ్యారు. ఇద్దరూ బ్లాక్ డ్రెస్‌లు ధరించి ఫొటోలకు ఫోజులిస్తూ సందడి చేశారు. ఐశ్వర్య తల్లి బృంద్య, అను రంజన్‌తో కలిసి ఈ స్టార్ జంట సెల్ఫీలు దిగారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా, ఐశ్వర్యరాయ్, అభిషేక్ బచ్చన్ జంట విడాకులు తీసుకోబోతున్నదంటూ ఇటీవల వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. అభిషేక్ నటి నిమ్రత్ కౌర్‌తో రిలేషన్‌లో ఉన్నాడని.. ఈ క్రమంలోనై ఐష్ నుంచి విడిపోనున్నట్లుగా బాలీవుడ్ కోడై కూస్తున్నది. ఐశ్వర్య మాత్రం కూతురు ఆరాధ్యతో కలిసి వేరుగా హాజరవడం ఈ వార్తలకు మరింత ఆజ్యంపోసినట్లయ్యింది. అలాగే, ఒక్కగానొక్క కూతురు ఆరాధ్య బర్త్ డే వేడుకలకు సైతం అభిషేక్ దూరంగా ఉన్నాడు. దీంతో ఈ జంట త్వరలో విడాకులు తీసుకోవడం ఖాయం అని అందరూ భావించారు. ఇంతలోనే ఇద్దరూ ఓ కార్యక్రమానికి హాజరై ఆ రూమర్స్‌కు చెక్ పెట్టారు.





# నగర సమగ్రాభివృద్ధికి కృషి

- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- రూ.1.23 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కమ్యూనిటీ హాల్ స్థల దాతకు సన్మానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర రెండో రాజధానిగా వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ పేర్కొన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 38 వ డివిజన్ పడమర కోటలో జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో రూ.1.23 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శుక్రవారం నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. పడమర కోటలో మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే మహిళా కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి, రూ.23 లక్షల వ్యయంతో మహిళల కమ్యూనిటీ హాల్ లో మిగిలిన పనులకు, లక్షల రూపాయల వ్యయంతో పడమర, మధ్య కోటలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి, రూ.20 లక్షల వ్యయంతో ఖిలా వరంగల్ లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నగర సమగ్ర అభివృద్ధికి రూ.6 వేల కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి గుర్తు చేశారు. గతంలో తాను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఈ డివిజన్ కు రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. 38 వ డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని ఇచ్చిన దాతల కుటుంబ సభ్యులను మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ దామోదర్ యాదవ్, బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్రతో పాటు కమ్యూనిటీ హాల్ స్థల దాత గద్దల రమేష్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### స్వీయ రక్షణకు కరాటే అవసరం

ప్రస్తుత సమాజంలో బాల, బాలికల స్వీయ రక్షణకు కరాటే అవసరమని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఖిలా వరంగల్ లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షన్ ద్వారా బాలికల కొరకు ఏర్పాటు చేసిన స్వీయ రక్షణ శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి మంత్రి కొండ సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కరాటే కాంపిటీషన్ లలో విజయం సాధించిన వారిని మంత్రి, కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక కార్పొరేటర్ ఉమా దామోదర్, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీఆర్ డీఓ కౌసల్యాదేవి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ కు నివాళి..

భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఖిలా వరంగల్ పడమరకోటలోని అంబేద్కర్ విగ్రహానికి మంత్రి కొండా సురేఖ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అంబేద్కర్ అంతటి మహోన్నత వ్యక్తి, విద్యావేత్త, మేధావి మన దేశంలో పుట్టి, మనకు ప్రాతినిధ్యం వహించడం మన అదృష్టమని మంత్రి సురేఖ అన్నారు. అంబేద్కర్ లేని భారతదేశాన్ని అసలు ఊహించుకోలేమన్నారు. అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు ప్రాతిపదికగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శ్రేయోరాజ్య స్థాపనకు అహర్నిషలు శ్రమిస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# సంక్షేమం మరిచి రాద్ధాంతం

- తీరు మారని బీఆర్ఎస్, బీజేపీ
- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర సంక్షేమం మరిచి రాద్ధాంతం చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పనిచేస్తున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, మహబూబాబాద్ జిల్లా ఇంచార్జి బండి సుధాకర్ గౌడ్ ఆరోపించారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటి నెరవేర్చుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రజల సంక్షేమానికి రూ.60 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. 7 డిసెంబర్ 2023న సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి రబీ సీజన్ లో మొదటి ఆరు నెలలకు గాను రూ.7,600 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశారన్నారు. రెండో ఆరు నెలలకు గాను సుమారు 26 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసి మొత్తం రైతంగానికి రూ.28,600 కోట్లు హెచ్చించి రైతు బిడ్డ అని నిరూపించుకున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో రెండు విడుతల రైతుబంధు కింద కేవలం రూ.14,000 కోట్లు మాత్రమే ఇచ్చిన సంగతి మరువరాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారన్నారు. 50 లక్షల మంది గృహాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నామని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరాన్ని ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేయడంతోపాటు హైడ్రా, మూసి ప్రక్షాళన, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, ధరణి ప్రక్షాళనతో భూ సమస్యలు పరిష్కారం, విద్యార్థులకు మేస్ చార్జీలు పెంచడం, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, సచివాలయంలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటుచేసి తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. వాస్తవాలు ఈ విధంగా ఉంటే ప్రతిపక్షాలు ఓర్వలేక నేల విడిచి సాము చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలు అమలు చేస్తామంటూ బండి సుధాకర్ గౌడ్ ప్రకటించారు. ప్రజలు ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ సంపదను దోచుకొని దాచుకున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్ని అవకతవకలను వెలికి తీసి ప్రజల ముందు ఉంచి ప్రజాక్షేత్రంలో శిక్షిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు.




# రోడ్డువెంట ఆక్రమణల తొలగింపు

### చిరు వ్యాపారుల ఆందోళన

**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట రైల్వే స్టేషన్ కు అతి సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై గల చిరు వ్యాపారాల దుకాణాలను వరంగల్ మున్సిపల్ అధికారులు శుక్రవారం జేసీబీలతో కూల్చివేశారు. దీంతో తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేస్తున్నారంటూ చిరు వ్యాపారులు ఆందోళనకు దిగారు. రోడ్డుపైన చిన్న చిన్న దుకాణాలు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు, తమ కుటుంబాన్ని పోషించుకునే ఆధారం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. చిరు వ్యాపారుల మీద బల్దియా అధికారులు ప్రతాపం చూపిస్తే మేము ఎలా బతకాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు.



# హత్యకు గురైన రాజమోహన్ అంత్యక్రియలు పూర్తి

### అమెరికా నుంచి వచ్చిన కూతురు శిరీష

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని రాఘవేంద్ర కాలనీలో నివాసముంటున్న విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి వెలిగేటి రాజమోహన్ ఈనెల 3న దారుణ హత్యకు గురి కావడం సంచలనంగా మారింది. అయితే అమెరికాలు ఉంటున్న రాజమోహన్ కుమార్తె ఆడెపు శిరీష భర్త ఆడెపు నవీన్ శుక్రవారం నగరానికి చేరుకున్నారు. ఆయనకు కుమారులు లేకపోవడంతో కూతురే అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అయితే అత్యంత దారుణంగా హత్య చేసి కారులో వదిలి వెళ్లడాన్ని సవాలుగా తీసుకున్న మట్టేవాడ పోలీసులు కేసును ఛేదించినట్లు సమాచారం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com